క్లుప్తంగా

వ్యాపారులతో సమావేశం



వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహిస్తున్న డీఎం మైనోద్దీన్

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీ స్థలాల టెండర్ల విషయమై ఔత్సాహిక వ్యాపారులతో గురువారం డీఎం మైనోద్దీన్ తన కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న పుట్టపర్తిలోని ప్రజారవాణా అధికారి కార్యాలయంలో టెండర్లు నిర్వహిస్తారన్నారు. టెండరుకు సంబంధించిన పూర్తి నిబంధనలను వ్యాపారవేత్తలకు ఆయన వివరించారు. సమావేశంలో ట్రాఫిక్ అధికారి నాగసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో సీఆర్‌ఎంటీ మృతి



బాబావలి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీసీ దేవరాజ్, సిబ్బంది

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కొత్తదేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న సీఆర్‌ఎంటీ బాబావలి(45) గురువారం విధుల్లో ఉండగానే గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సమగ్రశిక్ష ఏపీసీ దేవరాజ్, ఎంఈఓలు జయచంద్ర, సోమశేఖర్ నాయుడు బాబావలి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాబావలి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. అంత్యక్రియల కోసం రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ చంద్ర, ఎల్ చంద్రమోహన్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

తనకల్లు: రైతులు పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. టీ.సదుం గ్రామంలో గురువారం క్రాప్‌లోన్, పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ కలిగిన ఖాతాదారులు పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై తదితర పథకాల ద్వారా ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. వేరుశనగ పంట ఎకరాకు రూ.650, టమాట ఎకరాకు రూ.1619, పత్తి పంట ఎకరాకు రూ.1923 చెల్లించి బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నవీన్‌కుమార్, ఆది, బ్యాంక్ మిత్రాలు రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సేవలు చిరస్మరణీయం



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ధర్మవరంరూరల్: వ్యవసాయ రంగానికి స్వామినాథన్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్వామినాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మారుతి మాట్లాడుతూ జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా స్వామినాథన్ రైతులకు ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, గుంపు హరి, ఖాదర్‌బాషా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేకపోతు అపహరణపై కేసు

కదిరి టౌన్: మేకపోతు అపహరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీకి చెందిన టెంకాయల అమీర్‌సాహెబ్ చెందిన మేకపోతును గత నెల 29న తన బొలెరో వాహనంలో కట్టివేశాడు. అయితే మధ్యాహ్నం సమయంలో మేకపోతు అపహరణకు గురైంది. అమీర్‌సాహెబ్ చుట్టుపక్కల విచారించగా బాబావలి అనే వ్యక్తి దాన్ని ఎత్తుకెళ్లినట్లు తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆరుబయటే అనాథగా..

- రోడ్డు ప్రమాదంతో దళితుడి బతుకు ఛిద్రం
- కాళ్లు విరిగి నడవలేని స్థితికి చేరుకున్న వైనం
- పాఠశాల ఆవరణలో అచేతనావస్థలో దుర్భర జీవనం



ఆర్డీటీ పాఠశాల వద్ద దీనంగా ఉన్న వెంకటరమణ

గాండ్లపెంట: రక్త సంబంధీకులు, బంధువులు ఉన్నా ఆదరించేవారు లేక ఓ దళితుడు అనాథగా మారిపోయాడు. ప్రమాదంలో కాళ్లు దెబ్బతినడంతో నడవలేని స్థితిలో తన పని తాను చేసుకోలేని నిస్సహాయ స్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. వేపరాల ఎస్సీ కాలనీకి చెందిన బి.వెంకటరమణ పొట్టకూటి కోసం 20 ఏళ్ల క్రితం కదిరికి వలస వెళ్లాడు. అక్కడ కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకునేవాడు. 15 ఏళ్ల క్రితం వెంకటరమణ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. తర్వాత కాలంలో కుమారుడికి వివాహం చేయడంతో అతడు మరొక గ్రామానికి మకాం మార్చాడు. అప్పటి నుంచి ఒంటరిగా వెంకటరమణ ఒంటరిగానే జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం తోపుడుబండిలో కొబ్బరి బోండాలు వ్యాపారం చేసే సమయంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అయినా నడవలేని పరిస్థితి. దీనికితోడు ఆపరేషన్ చేసిన చోట గాయం మానక పోగా చీము, రక్తం వస్తుండడంతో నొప్పితో విలవిలలాడుతున్నాడు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

ఆపరేషన్ అనంతరం నడవలేని స్థితిలో ఉన్న వెంకటరమణ అతికష్టం మీద స్వగ్రామం వేపరాల ఎస్సీ కాలనీకి చేరుకున్నాడు. అయితే అక్కడ రక్త సంబంధీకులు ఉన్నా ఎవరూ ఆదరించలేదు. ఉండటానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో ఆర్డీటీ పాఠశాల ఆవరణే దిక్కయ్యింది. అక్కడే ఒక పాత మంచంపై ఉంటున్నాడు. స్వతహాగా పనిచేసుకోలేకపోవడం.. సపర్యలు చేసేవారు లేకపోవడంతో నరకం అనుభవిస్తున్నాడు. కాలనీవాసులు ఎవరైనా ఇంత తిండి పెడితే తిని కాలం నెట్టుకొస్తున్నాడు. ఆధార్, రేషన్ కార్డు ఉన్నప్పటికీ.. వైకల్యం బారినపడిన వెంకటరమణ సదరం సర్టిఫికెట్ తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్నాడు. దీంతో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశమూ లేకపోయింది. మానవతా దృక్పథంతో ఎవరైనా తనకు వైద్యం చేయించాలని, ఉండటానికి గూడు, వైకల్య పింఛన్ మంజూరుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

నేడు మహాలక్ష్మీ దేవాలయంలో వరలక్ష్మీ వ్రత వేడుకలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో కొలువైన మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రమణయ్య గురువారం తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు లక్ష్మీనారాయణస్వామి పూజతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 7 గంటల నుంచి శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు, కలశపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి ఉంటుందన్నారు. 8 గంటల నుంచి నిత్యపూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. పద్మావతి, వెంకటేశ్వర స్వామి కల్యాణం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భారీ వాహనాల ప్రవేశం నిషేధం

కదిరి టౌన్: పట్టణంలోని తిరువీధుల మీదుగా ఇక నుంచి భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి గురువారం తెలిపారు. కాలేపల్లి బైపాస్ రోడ్డు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. వాహనదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి అమానుషం



విలేకరులతో మాట్లాడుతున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జెడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరగకూడదనే టీడీపీ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 12న పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను శాంతియుతంగా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగితే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్నారు. చంద్రబాబు పతనం పులివెందుల నుంచే ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో జరిగే అరాచకాలకు సీఎం చంద్రబాబు, లోకేష్, డీసీఎం పవన్‌కళ్యాన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాం పేరుతో అన్యాయంగా అరెస్ట్ చేశారని, ఇందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్,గంగాధర్, రమేష్‌యాదవ్, బాబా, షకీల్ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



తహసీల్దార్ స్వర్ణలతకు సమ్మె నోటీసును అందిస్తున్న కార్మికులు

బత్తలపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న సత్యసాయి నీటి సరఫరా కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఈ నెల 11 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సత్యసాయి కార్మికులు పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ నల్లప్పకు సత్యసాయి కార్మికులు జగన్ మారుతి, రఘుపతి, బాషా, అనంతయ్య, బత్తల మల్లేసు, జయరాం సమ్మె నోటీసులను అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ సత్యసాయి నీటి పథకం కార్మికులకు గత నాలుగు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలను చెల్లించలేదని ఈ విషయమై అధికారులు, మంత్రులను కలిసి సలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి కేటాయించిన బడ్జెట్ నుంచి వెంటనే నిధులు విడుదల చేసి నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని, పథకం సక్రమ నిర్వహణకు అవసరమయ్యే బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నారాయణస్వామి

ధర్మవరం రూరల్: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ముదిగుబ్బ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేది వరకు బస్టాండ్ సర్కిల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో గురువారం తహసీల్దార్ నారాయణస్వామి వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షులు విశ్వమూర్తి, సభ్యులు రత్నమాచారి, ముసలనాయుడు, రామాంజి, లక్ష్మన్న, సురేష్‌చౌదరి, శివబాలు, సూరి, చిన్నప్ప, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే కేసులు



హోటల్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: వంట గ్యాస్ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే కేసులు నమోదు అవుతాయని జీపీఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గోరకాటి మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం పలు హోటళ్లు, టీస్టాళ్ల వద్ద వంట గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్న వారికి జీపీఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అవగాహన కల్పించారు. వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అమ్మితే అటువంటి వారి గ్యాస్ కనెక్షన్, రేషన్‌కార్డు రద్దవుతాయన్నారు.

ఉన్నతస్థానాలు అధిరోహించండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం రావులచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్, సీపీఎం నాయకులు

నల్లచెరువు: మండల కేంద్రంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా అధ్యక్షుడు డి. సుబ్బయ్య, చంద్ర మండలాధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎం హైదర్‌వలి, పి. రామచంద్ర, మల్లికార్జున, పోలీస్ చిన్నరెడ్డెప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్, సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయుబ్‌ఖాన్, మారుతి, ఎల్.ఆదినారాయణ, నాయకులు దౌల, రాజు, నరసింహ, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న మధు కంటి వైద్యశాలలో గురువారం చేనేత కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకారపు నరసింహులు 35 మంది చేనేత కార్మికులకు కంటి పరీక్షలు చేసి మందులను అందించారు.

మోసం బాబుకు వెన్నతో పెట్టిన విద్య



రెడ్డిపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



మామిళ్లకుంట్లపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



కొత్తదేవరపల్లిలో క్యూఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నల్లమాడ: ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం యర్రవంకపల్లి, వేళ్లమద్ది, కొండకింద తండా పంచాయతీ కేంద్రాల్లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలంటూ గొప్పలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి యేడాదిన్నర అవుతున్నా ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 సంవత్సరాలకే పింఛన్ పథకాలపై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలే గాక ఇవ్వని మరెన్నో పథకాలను అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ×బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ¤ ప్లకార్డులను ప్రదర్శించారు. మాజీ ఎంపీపీ టీడీ జయరామిరెడ్డి, సర్పంచ్‌లు రజనీకాంత్‌రెడ్డి, బొజ్జేనాయక్, పార్వతీబాయి, కుళ్లాయప్ప, ఆనంద్‌నాయక్, లింగమూర్తి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, మహిళా విభాగం మండల కార్యదర్శి ఇ.జయమ్మ, షంషీర్, నాగార్జునరెడ్డి, సతీష్‌యాదవ్, ఎస్టీ, మైనార్టీ, యూత్ విభాగాల మండల అధ్యక్షులు రాజేంద్ర నాయక్, సలీంబాషా, హరినాథరెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, సీతారాం, కుళ్లాయినాయక్, జయదేవరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, హరి, మంగేనాయక్, చంద్రహాసరెడ్డి, ఆనంద్, ప్రతాప్, రఫీ, వెంకటరమణ, గణేష్‌నాయక్, సురేష్‌నాయక్, సూర్యనారాయణ, రామాంజి, గంగాద్రి, చిన్నా, భాస్కర, రాంమోహన్, రామక్రిష్ణారెడ్డి, ఎంసీ బయపరెడ్డి, మాధవరెడ్డి, రంగారెడ్డి, ఎం. రాంమోహన్‌రెడ్డి, వెంకటేష్‌నాయక్, అనిల్, కిష్టప్ప, ఆనంద్‌నాయక్, విద్యాసాగర్, లక్ష్మినాయక్, గణేష్ నాయక్, గేమేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన వారిని నట్టేట ముంచడం బాబు నైజం

ఓడీచెరువు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కి గెలిపించిన వారినే నట్టేట ముంచడం బాబుకు మామూలేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి విమర్శించారు. మామిళ్లకుంట్లపల్లి, తొట్లివారిపల్లిలో గురువారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మిరెడ్డి ఎంపీపీ తుమ్మల పర్వీన్ భాను, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఈ 14 నెలల కాలంలో బాబు ఆయా కుటుంబానికి ఎంత మోసం చేశాడో అంకెలతో సహా వివరించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం బాబుకు పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయించడంతోపాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఓడీచెరువు టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్ణారెడ్డి, బాబా, నాయకులు బయపరెడ్డి, గంగిరెడ్డి, రాజారెడ్డి, విశ్వనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, రామస్వామిరెడ్డి, మధు, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, పెస్సాని బయపరెడ్డి, చంద్ర, నారాయణరెడ్డి, నరసింహరెడ్డి, మనోహర్‌రెడ్డి, పాల సూర్యనారాయణరెడ్డి, రెడ్డప్పరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొత్తదేవరపల్లిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలని ఊదరగొట్టి గెలిచిన తర్వాత హామీలను అమలు చేయడం లేదన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి ఎంపీటీసీ, జి. చెన్నారెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, మురళీరెడ్డి, గోపాల్ రెడ్డి, అంజన్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, నరసింహారెడ్డి, వి. పోతిరెడ్డి, నారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రాజశేఖరరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

తాడిమర్రి: తన రచనలతో జనాన్ని జాగృత పరిచిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని గ్రంథాలయ అధికారి డీ.శీనా నాయక్ కొనియారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం ఆయన పాఠకులతో కలసి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. నోబెల్ పొందిన తొలి భారతీయుడు ఠాగూర్ అని కొనియాడారు.

కేసు నమోదు

కదిరి టౌన్: సెల్‌ఫోన్ చోరీ చేశాడని ఓ వ్యక్తిని కరెంట్ స్తంభానికి కట్టేసి కొట్టిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..గజ్జలరెడ్డిపల్లి కాలనీకి చెందిన మద్దెల బాబు తన స్నేహితుడు అయిన హమాలి పతితో కలిసి ఈనెల 3న మద్యం సేవించారు. అయితే ఆసమయంలో హమాలి పతి సెల్‌ఫోన్‌ను పోయింది. అయితే బాబు ఆ ఫోన్ దొంగలించినట్లు అనుమానించి హమాలి పతి తల్లి గౌరమ్మ, వెంకటేష్ అనుమానించి విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం

తనకల్లు: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని టీ. సదుంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు జీవనాధారమన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలలు ఖచ్చితంగా తల్లి పాలనే పట్టించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి, బాలింతలు, గర్భిణులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీ స్వామి, ఆరోగ్య సిబ్బంది కల్పన, నూర్జహాన్, మహిళా పోలీస్ శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుశీలమ్మ, ఉమాదేవి, శ్యామల, గణమ్మ పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కదిరి టౌన్: సత్యసాయి నీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. గురువారం కదిరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులు, మంత్రులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో ఈనెల 11 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళుతున్నారన్నారు. 14 రోజులు ముందే సమ్మె నోటీస్ ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేటాయించిన బడ్జెట్ నుంచి వెంటనే నిధులు విడుదల చేసి, 4 నెలల బకాయి వేతనం ఇవ్వాలన్నారు. పథకం నిర్వహణకు అవసరమయ్యే పూర్తి బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ, నేతలు జీఎల్.నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రమోహన్, మోహన్‌శర్మ, అశోక్, లక్ష్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి



ఏపీసీ దేవరాజ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి: జిల్లా సమగ్రశిక్ష శాఖలో ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, నేతలు ఖాసీం సాబ్, సాంబశివారెడ్డితో కలిసి బుక్కపట్నంలోని జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దేవరాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యాలయంలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబలైజేషన్, అలెస్కో, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్, ఏఏఎంఓ, ఏఎస్ఓ, ఏజీసీడీఓ తదితర పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పైన పేర్కొన్న పోస్టుల భర్తీలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టాలని కోరారు. గత సంవత్సరం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్, జ్ఞాన జ్యోతి, టరల్ శిక్షణ తరగతుల రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలన్నారు.

బైపాస్ రోడ్డు ప్రారంభం

కదిరి అర్బన్: మండలంలోని కాలేపల్లి వద్ద నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డును గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భారీ వాహనాలకు బైపాస్ మీదుగా మళ్లించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయిలో బైపాస్ రోడ్డు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

రామగిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ మీనుగ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని పేరూరులో జరిగిన ఓ శుభకార్యంలో వీరు పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సుపరిపాలన అందించలేకపోతున్నారన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, జెడ్పీటీసీ మారుతీ ప్రసాద్, నాయకులు నరసింహారెడ్డి, రాజేష్, మారెన్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రంలో శ్మశాన వాటిక కోసం గురువారం ఆర్ఐ భాస్కర్‌రెడ్డి పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక బైపాస్ వద్ద ఉన్న స్థలం శ్మశాన వాటికకు అనువుగా ఉంటుందని సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్‌జాన్, అల్లాబక్షు, నరేష్ తదితరులు ఆర్ఐకు తెలియజేశారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందిస్తామని ఆర్ఐ పేర్కొన్నారు.